# వెదవ బ్రతుకు

★



రచన :

శ్రీ వి. విజయభాస్కర్.

---

సమయం బహుశా ఎనిమిది గంటలు కావచ్చు. పట్టణం వీది దీపాల వెలుగుల్లో వింతకాంతులను సంతరించుకుంటూంది. పగలంతా కష్టంచేసి అలసి నీరసించిపోయి విశ్రాంతి తీసుకుంటున్న వాళ్ళు కొందరైతే, తీసుకున్న విశ్రాంతికి గుడ్ బై చెప్పి అప్పుడే తమ పనుల్లోకి దిగిపోతున్నవారు మరికొందరు.

ఏది ఎలాగయినప్పటికిని పట్టణం మాత్రం కళ్ళు తెరుచుకుని మెలకువగానే ఉన్నది. ఏ మాత్రం తీరిక లేకుండా ఊపిరి తీసుకోవడానికి కూడా వ్యవదిలేనట్లు రెప్పపాటున కనపడి మాయమవుతున్న కార్లు, లారీలు, సిటీబస్సులు వగైరా వగైరా హడావుడిలో, ఏమయితేనేం పట్టణంమేలుకునే ఉంది.

ఆ పట్టణంలో ఇప్పటి వరకూ గవర్నమెంట్ వారి దృష్టిపడకుండా ఒక చోటుంది. ఒకటంటే ఒకటే కాదులెండి. అలాంటివి చాలా ఉన్నాయి. కాని, అటువంటి వాటిలో ఇది ఒకటి.

ఎంత మంచి అందమయిన నగరమయినా మురికి కాలవలూ దోమలూ, ఈగలూ తప్పక ఉంటాయి. అలాగే భారతదేశం ఎంత ముందడుగు వేసినప్పటికిని మనుష్యుల్లో కూడా ఈగలూ, దోమలూలాంటి వాళ్ళుకూడా ఉంటారు. వాళ్ళే దేశానికి అక్కరలేనివారు.

రాజాలు రిక్షాను వాకిలి ముందు నిలబెట్టి, తడికె తలుపును నెట్టుకుని లోపలికి వచ్చాడు. తమ కనవసరంగా అటంక పరిచినందుకు అక్కడున్న దోమలన్నీ ఐక్యమయి రాజాలు మీదికి దండెత్తి వచ్చాయి ఝూంమ్మంటూ. అయినా ముందే చెప్పాను — అక్కడ నివసించే వాళ్ళంతా ఇలాంటి చిన్న చిన్న విశయాలను గురించి గవర్నమెంట్‌కు బాద కలిగించే వాళ్ళుకారు. అందుకే రాజాలు అంతగా జోక్యం కలిగించుకోలేదు. లోపల ఏడుస్తున్న తల్లిగొంతు స్పష్టంగా వినవస్తూంది రాజాలుకు.

ఆ ఏడుపు వినడంతోనే "బహుశా అయ్యవచ్చిపోయాడేమో" అనుకున్నాడు మనసులో రాజాలు.

"అవ్వోయ్! కూడెయ్యవే! బాడికల్లాలి" మంచం మీదం నడుం వాలుస్తూ లోపలికి కేక వేశాడు.

కుక్కి మంచమాయే! కుయ్యోమంది.

లోపల్నుంచి వచ్చింది నూకాలమ్మ.

ఈకలు పీకేసిన కోడిలా ఉంటుంది నూకాలమ్మ. ఏడుస్తూనే అంది "డబ్బుతెచ్చావా?"

ఎందుకేడుస్తున్నావే అని రాజాలు అడగనూలేదు నూకాలమ్మ చెప్పనూలేదూ.

బజ్జి తినుకుంటూ వచ్చి అడిగింది ముత్యాలు "ఓ అన్నయ్యా! రిబ్బన్లు పట్టుకొచ్చినావా!" అని.

"ఎహే, పోవే! శని ముఖము దానా ఎప్పుడునూడూ వెదవ రిబ్బన్లు" అరిష్టం, కోపం మిళితంచేసి చెల్లెలి మీద చూపించాడు రాజాలు.

అది ఏడుస్తూ నూకాలమ్మ చెంతకు పోయి ఆమెతో పాటూ కలిసికట్టుగా ఎడ్వడం మొదలు పెట్టింది.

రాజాలు జేబులోంచి బీడికట్టా మొదలగునవన్నీ తీసి ప్రక్కన పెట్టి, పదిహేను రూపాయలు తీసాడు.

చెమటతో దడిసి ఉన్నాయానోట్లు, అందుకే ముద్దగా తయారయ్యాయి.

C.K.C
ELEPHANT BRAND




Carnataka Knitting Co.
TIRUPUR - 638 602.

★

**Sales depot:**

No. 4-6-213, PAN BAZAAR,
SECUNDERABAD - 500 003.

చిల్లరతీసి లెక్క పెట్టుకుని మళ్ళీలోపల వేసుకున్నాడు.

ఆ రూపాయిలు తీసుకెళ్ళి నూకాలమ్మ చేతిలో పెట్టి "యియ్యాల బేరం బాగానే సాగింది. జెల్దికూడెయ్యవే! మళ్ళీ మొదలాట యడిచిపెట్టే టైం అవుతాది" అన్నాడు.

నూకాలమ్మ ఏడుపు మాయమయి పోయింది. బర్రుమని ముక్కు చీదేసి, ఇంకా ఏడుస్తూ అదే ఆరున్నొక్క రాగాన్ని కంటిన్యూగా మెయిన్ టైన్ చేస్తున్న ముత్యాల్ని వీపున ఒక్కటి చరిచి "పోయి ఆడుకో పో!" అంది.

రాజాలు అన్నం తింటున్నాడు.

నూకాలమ్మ ప్రేమతో ప్రక్కన కూర్చుండి వడ్డిస్తుంది.

"నువ్వు కూడా బువ్వేసుకోవే!" రాజాలు అన్నాడు.

"ఇంకెక్కడుంది ఏసుకోడానికి? మద్దేనం ఆ డాట్రుగోరమ్మగారు ఇంతంత పెత్తే, ఈ పూటకు సరి పోద్దిలే అనుకుని వంట చేయకుండానే పెట్టినిగదా! కాకిలా వచ్చి సగం కుండం కాళీచేసి పోవడమే కాక ఇంకా పైగా సారా తాగడానికి డబ్బులీలేదని గొడ్డును బాదినట్టుబాది బొమికలిరగ బొడిచిండు మీ అయ్య. ముదనట్ట పోడు. ఇంకెప్పటికి బుద్దొత్తదో ఏమో!"

"మరి నీకో"

"ఇప్పుడ్డబ్బులిచ్చావుగా! కోమటి లింగయ్య కొట్టుకెళ్ళి కాసంత బియ్యం, ఉల్లిపాయలు, కొనుక్కొని ఏదో ఒకటి చేసుకుంటాలే."

సమాదాన పడ్డాడు రాజాలు.

బోజనం చేసి రిక్షా తీసుకుని బయటకు వెళ్ళి పోయాడు.

కొంచం సేపయినతరువాత సీతయ్య తడిక తోసుకుని లోపలికొచ్చాడు.

"రాజాలు గాని వచ్చాడేంటే?" మంచం మీద నిద్రపోతున్న నర్సయ్య ప్రక్కనే తూలబడుతూ అడిగాడు.

నూకాలమ్మ మాత్రం మౌనం వహించింది.

అన్నం కలియపెడుతూ మూగగా ఉండి పోయింది.

"ఎదవ ముండ-రిబ్బనో రిబ్బనో అంటూ ఏడ్చి ఏడ్చి అన్నం కుడవకుండానే గుమ్మం ప్రక్కనే నిద్ర

పోవాది" గుమ్మం ప్రక్కనే నిద్రించిన ముత్యాలును చూస్తూ అనుకుంది.

"ఏందే, గుడిసేటి ముండా? కాజాలొచ్చాడా లేదా?" ఈ సారి రెట్టించడిగాడు సీతయ్య.

నూకాలమ్మను కోపం ఆవహించింది. ఆఁ వచ్చాడు, వచ్చాడు. ఇంత మూట తెచ్చాడు తీసుకెల్లు. కల్లు పాకల్లోనో సారా కొట్లల్లోనో తాగి తందనాలాడ్డానికేగా? ఎదవ బ్రతుకు బతికేం లాభం. ఎక్కడైనా పడి సావరాదు? ఆమె పవిత్ర భారత నారీమణే కాని, ఆసమయంలో సీతయ్య తన మొగుడని మరచి పోయుంటుంది.

బహుషా అదే అనుమానం సీతయ్య కేసుంటుంది.

"ఏంటేయ్! నన్నెవరనుకున్నావే? నీ మొగుణ్ణే ముండా! ఓ రెండు రూపాయలు పడెయ్య, గదమాయించాడు.

నూకాలమ్మంటే మాత్రం ఎవరు? సీతయ్య పెళ్ళాం అంటే అతనికంటే ఏం తక్కువ తినలేదన్నమాట.

"నా కదేమీ తెల్దూ. అయిన కాడికీ కానికాడికి రూపాయలిమ్మంటే యీడేమైనా చెట్లకు కాస్తున్నాయా? లేవు ఫో" అంతకంటే అధికం మాట్లాడ్డం లాభంలేదనుకుని గంజి వార్చటానికి ముంతకోసం లేచింది. అప్పుడు బొడ్లో దాచిన పదిరూపాయిల కాగితం క్రింద పడింది. సీతయ్య ఒక్క ఉదుటున దాన్ని అందుకున్నాడు. క్రిందపడిన సంగతి నూకాలమ్మ గమనించేలోగా_

"దొంగ లంజాముండా! పదిరూపాయిలు బొడ్లో దాచుకుని రూపాయల్లేవు పొమ్మంటావటే పీనుగ మొకం ముండా!" నిన్నూ... నిన్నసలు యిరగ బొడవాలే, థూ_ముదనష్టపుదానా." తుపుక్కున ఉమ్మేశాడు నూకాలమ్మ మీద దగ్గరగా వచ్చి.

"ఓలమ్మో, ఓలయ్యో దొంగ సచ్చినోడా డబ్బులియ్యి" నూకాలమ్మ యీనిన పులిలా గర్జించి సీతయ్య మీదకు దూకింది.

సీతయ్య తూలి పడబోయి మరల నిలదొక్కుని పది రూపాయలు నిక్కరు జేబులో పెట్టుకుని నూకాలమ్మ జుట్టందుకున్నాడు ఒక చేత్తో.

నూకాలమ్మ కేకలకు, పెనుగులాటకూ నిద్దరపోతున్న నర్సయ్య, ముత్యాలు లేచి ఏడ్పులంకించున్నారు.

తబలా మోదినట్టు దబాదబా మోగింది నూకాలమ్మ వీపు.

"ఓలమ్మో, ఓలయ్యో సంపేత్తున్నాడు. ఈ దొంగా లంజకొడుకు. ఈ దొంగ సచ్చినోడి కాడుకాల. బాబోయ్!" నూకాలమ్మ డైరెక్షన్ లేకుండా యాక్టింగ్, డయలాగ్స్ ఒప్పచెప్పేసింది గబగబా పొల్లుపోకుండా.

వెనక నర్సయ్య ముత్యాలుల బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్.

పాపం చెయ్యి నొప్పి పెట్టిందేమో. కొట్టడం చాలించాడు సీతయ్య.

పాపం నూకాలమ్మకు నోరు నొప్పెట్టిందేమో! తిట్టడం ఆపి క్రింద పడిపోయిందీ.

"థూ, లంజముండా!" చివరిసారిగా దీవించి ఆ రోజు కిక రిహార్సల్స్ ముగిసినట్టు హీరోలా బయటకు వెళ్ళిపోయాడు శీతయ్య.

బాక్ గ్రౌండ్ మ్యూజిక్ మాత్రం ఆగలేదు.

పూర్తిగా ఇల్లుకాలిపోయి ఆరిపోటున అరగంటకు

Phone : 35034




Krithi Industries

Ganapathy Post,

Coimbatore - 641 006

TRADE ENQUIRIES SOLICITED

--SUGUNA

ఫైరింజన్ వచ్చినట్లు హుటాహుటిని వచ్చింది భాగ్యలక్ష్మి.

“ఏందప్పా, ఏందప్పా, యామయింది” అంటూ.

నూకాలమ్మ భాగ్యలక్ష్మిని చూడ్డంతోనే సౌండ్ కాస్త పెంచి ఏడ్వసాగింది.

“ఊరుకోయే, ఊరుకో అప్పా!” భాగ్యలక్ష్మి అనునయించ బోయింది.

“నీకేందే మొగుడా, వల్లకాడా? సూడు. సచ్చినోడు పాపం రాజాలు ప్రొద్దట్నుంచి రెక్కలు ముక్కలు చేసుకుని డబ్బుసంపాదించి నాకిస్తే, కొంత డబ్బుతో బియ్యం వగైరా కొనుక్కొచ్చి ఆ పదిరూపాయిల కాగితం బొడ్లో పెడ్తిసా దాన్ని లాక్కెల్లి పోయాడే, వాటితో తల తిరిగే దాకా తాగొస్తాడే దొంగ సచ్చినోడు!” దుఃఖం మరీ ఎక్కువ కావడంతో మరీమాట్లాడలేక పోయింది నూకాలమ్మ.

అవును భాగ్యలక్ష్మికి ఒక మొగుడంటూ లేడు. ఊళ్ళోవాళ్ళంతా దాని మొగుళ్ళే.

“ఊరుకో సూడు నిన్న జాని పిల్లల్యాడు లబలబలాడుతున్నారు. ఊరుకో.” భాగ్యగలక్ష్మి నచ్చజెప్పి బోయింది.

నూకాలమ్మ మాత్రం ఊరుకోలేదు. సీతయ్యను నానా దుర్భాషలాడుతూ అప్పుడప్పుడు పాలపొంగులా ఉండి ఉండి కొంచెం కొంచెంగా ఏడుస్తుంది.

భాగ్యలక్ష్మి, నూకాలమ్మ దగ్గరనుండి కదలి, పొయ్యి మీది అన్నం కుండ దింపి పిల్లల్ని బోజనానికి పిలిచింది.

ఈ విషయం తెలియగానే రాజాలుకు చెప్పరాని కోప మొచ్చింది. “ఎంత అయ్యాయితే మటుకు తన్ని పదిరూపాలెట్టుకెళ్ళి తాగడమే!” కోపంగా అన్నాడు.

“నేనేం సచ్చేదిరా! ఎప్పుడు బుద్దొస్తుందో ఏమో ఈ దొంగ సచ్చినోడికి” నూకాలమ్మ అన్నది.

“అన్నాయ్! నేను సినిమా కెల్తా! డబ్బులీ!” అన్నాడు నర్సయ్య మామిడి పిక్క చీకుతూ.

తండ్రి మీది కోపమంతా తమ్ముని మీద చూపించాడు రాజాలు. తమ్ముడి గూబ గుయ్‌మనిపించేలా కొట్టాడు. లేటాకులా ఎగిరి నీళ్ళకుండ పటాపంచలయి పోయింది. పగిలిపోయిన కుండపెంకుల మద్య నీటి చుక్కల్లో చందృడులా ఏడుస్తూ కూర్చున్నాడు. నర్సయ్య చొక్కా పూర్తిగా తడిసిపోయింది.

నూకాలమ్మ కూడా వాణ్ణి సముదాయించ ప్రయత్నించలేదు.

క్రిందపడ్డ మామిడి పిక్క అందుకుని బయటకు పరుగు తీసింది ముత్యాలు.

సీతయ్య లోపలికొచ్చాడు. మాట్లాడ్డం ఇష్టంలేక రాజాలు లోనికి వెళ్ళాడు. నూకాలమ్మ అక్కడే

ఎల్లప్పుడూ “జీబ్రా” బనియన్లనే ఉపయోగించండి!!

Always use Zeebra BANIANS

ఎందుకనగా...

అవి, కరెక్ట్‌సైజు, చక్కని అల్లిక, దీర్ఘకాలమన్నిక.

మా తయారింపులు :—

♦ ఫాంటా ♦ రాజు

♦ జీబ్రా ♦ జుల్లీట్

: తయారించువారు :

TEL : “ZEEBRA” PHONE : 21686

Zeebra Hosieries

LAKHSMINAGAR MAIN ROAD :: TIRUPUR - 638 602

కూర్చుంది శిలా ప్రతిమలా "కూడు పెట్టవే!" రెండు నిముషాల తర్వాత సీతయ్య మంచంమీద చతికిల పడుతూ అన్నాడు.

"కూడు లేదు."

"లేదూ?" రెట్టించాడు.

"లేదంటుంటే వినపడ్డంలా".

"ఛ, ఎదవకొంపం. ఎప్పుడొచ్చినా ఇదిలేదు అదిలేదు అని ఏడ్వడటం తప్ప ఏనాడైనా అడక్కుండా పెట్టావే!" చీధరింపుగా అన్నాడు.

"ఏదీ! పోయి సంపాదించుకురా! అప్పుడు పెడతా కూడు నువ్వడక్కుండానే.

"మాటకు మాట నేర్చావే!" ఈసడింపుగా అన్నాడు సీతయ్య.

"నేనూ నీ పెళ్ళాన్నేగా మరి"

"మరయితే రూపాయియ్యవే!"

నూకాలమ్మ మాట్లాడలేదు.

"అర్జెంట్ గా ఇయ్యవే" రెట్టించి అడిగాడు సీతయ్య.

"ఓయబ్బో ఈ మగాడికి రూపాయికావాలా తాగి తందనాలాడ్డానికేగా! ఛీ! ఎదవబతుకు. సిగ్గులేకపోతే సరి రోషంలేని బతుకు".

సీతయ్యకు రోషం వచ్చింది.

"ఒసేయ్! మాట్లాడకుండా రూపాయియ్యి. నేను ముందే అర్జంటని చెప్పాను అంతే".

"నాకు తెల్దు, నన్నడగద్దు, రాజాలునడుక్కో" అంది నూకాలమ్మ.

రాజాలు లోపల్నుంచి వచ్చాడు.

"అరేయ్, కొడకా రూపాయియ్యరా అర్జెంట్ గా" తండ్రి హోదాలో అడిగాడు స్టైల్ గా.

రాజాలొక్కసారి తండ్రి కేసి చూశాడు.

"అయ్యోయ్! తాగితే నీకేమొచ్చుద్ది?" అడిగాడు రాజాలు.

సీతయ్య మాట్లాడలేదు.

రాజాలు బయటకు వెళ్ళిపోయాడు రిక్షాలాక్కని.

"అయితే ఇవ్వవా"? వెనకనించి అడిగాడు సీతయ్య ఇంకా చావని ఆశతో.

నాకాడలేవు. విసురుగా జవాబిచ్చాడు రాజాలు.

ఛీ! ఎదవకొంప విసురుగా లేచి పాత చెంబును సొట్టలు పడేలా తన్ని, తడిక తోసుకుని బయటకు వెళ్ళిపోయాడు సీతయ్య, మళ్ళీ ఏం గురుతొచ్చిందో ఏమో వెనక్కి వచ్చి గుడిసెలోకి దూరి రెండునిముషాలాగి తర్వాత మళ్ళీ బయటకు వచ్చాడు హడావుడిగా సీతయ్య.

నూకాలమ్మ ఇదంతా గమనిస్తూ గుడిసె ముందు కూర్చుంది. కాని, అక్కణ్ణుంచి ఇంచుక మాత్రమయినా కదలలేదు. మొగుడు చేస్తున్నదంతా గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది.

అలాకొంచెం సేపు కూర్చుని తను మళ్ళి పాచీపని కెళ్ళాలని గుర్తుకువచ్చి గుడిసెలోపలికెళ్ళి గూట్లోకి చూసింది. ఆమె గుండె దడదడలాడింది.

అక్కడ ఉండవలసిన ఇత్తడిచెంబుతోపాటు వెండి గిన్నెకూడా లేదు. ఆగిన్నె తాను పనిచేస్తున్న డాటు గారిది. రాత్రి శాకంమిగిలితే ఆ గిన్నెలో పోసి ఇచ్చింది ఆ అమ్మ.

"ఓ అయ్యో!" బిగ్గరగా కేకపెట్టి బయటకు పరుగెత్తింది నూకాలమ్మ. సీతయ్య అక్కడుంటేగా?

మరునాడు నూకాలమ్మ ఏడుస్తూంది. ముత్యాలు నర్సయ్య అయోమయంగా బిక్కమొహం వేసుకుని చూస్తున్నారు.

సీతయ్య మాత్రం పక్కమంచం మీద పడుకుని ఆకాశంలో నక్షత్రాలను లెక్కడుతున్నాడు.

ఆయమ్మ మంచిది కాబట్టి పనిలోంచి తీసేసింది. మరొకళ్ళయితే పోలీసోళ్ళకు పట్టించేవారే. నూకాలమ్మ శోకాలు వినివిని రాజాలు బయటకు వెళ్ళిన అరగంటకు సీతయ్య వచ్చాడు. ఆ వచ్చినవాణ్ణి కొట్టి రక్కి, అది తీసుకునికొట్టి, ఇదితీసుకునికొట్టి నానా రబసచేసి అలసిపోయి ఏడ్వటం మొదలు పెట్టింది నూకాలమ్మ.

సీతయ్య మాత్రం మొద్దులా మౌనంగా ఉండిపోయాడు.

నూకాలమ్మ సంగీతం మాత్రం అదేస్థాయిలో ఉండి సీతయ్యకు ఆశీర్వచనాలు ఇస్తూనే ఉంది. ఇలా ఒక గంట గడిచింది.

ముత్యాలు, నర్సయ్య నేలమీదపడి నిద్దర పోయారు.

సీతయ్యకు విసుగెత్తింది వినివిని.

"ఛ నోర్ముయ్! ఎవడో సచ్చినట్లేడుస్తావేమే!"

మంచాలోంచి లేస్తూ అన్నాడు. ఒక్క నిముషమాగి_

ఒక రూపాయియ్యి అన్నాడు. అదేధీమా, అదేఠీవి. ఏమాత్రం తగ్గలేదు. పెళ్ళాం ఎందుకంతగా తిడుతుందో, ఎందుకంతగా ఏడుస్తుందో సీతయ్య కనవసరం. ఏదో తరగతికొచ్చి పాఠాలు వినిపోయే విద్యార్థిలా వచ్చాడు.

పెళ్ళాం తిట్లు తిన్నాడు.

అప్పటికి క్లాసయిపోయింది.

ఇక వెళ్ళిపోవాలి, వెళ్ళాలంటే రూపాయి కావాలి అంతే.

ఓదయ్యాన్ని చూసి జడుసుకున్నట్టు జడుసుకుంది ఝూకాలమ్మ.

ఓర్నాయనో నువ్వు మనిషివా రాచ్చసుడివా? ఇప్పుడే కదా పీకల్దాకా తాగి తందనాల్లాడి వచ్చింది. మల్లా అప్పుడే రూపాయా? ఓలమ్మో, ఓర్నాయనో యీడేదో నా పాలట యముడిలాగున్నాడ్రయ్యో! రాగాన్ని ఆలాపించింది ఝూకాలమ్మ.

ఛ! నోరెత్తావంటే బొమికలిరగబోడుత్తా ముందో రూపాయియ్యి. మద్దేనం సేసినట్టు సెయ్యమాక ఆడిగినపుడే డబ్బులిచ్చుంటే ఆ వెండి గిన్నె ఎత్తుకుపోయే వోడినా! వ్యవహారకర్తలా ఆడుగుతూ ముందుకు వచ్చాడు.

ఓర్నాయనో వీడికి సావు తెలివొచ్చిందిరోయ్ ఝూకాలమ్మ లౌడ్ స్పీకర్ స్పీడ్ పెంచింది.

సీతయ్యకు కోపమూ, అసహ్యమూ వచ్చాయి యియ్యే హే నేకపోతే నీయచ్చి... అతని మాటలింకా పూర్తికాలేదు.

తడిక దబ్బున విరుచుకు పడింది. దాని వెంట రాజాలు పడ్డాడు తడికలమీద.

ఎవరూ? రాజాలే ఆ గుడ్డి చీకట్లో కూడా గుర్తుపట్ట గలిగిందా మాతృ హృదయం.

గబగబా దగ్గరకు వస్తూ ఏందిరా రాజాలు ఏంటిది? అనడిగింది కళ్ళ నీళ్ళ పర్యంతంత అవుతూ.

అయ్యున్నాడా? మత్తుగా ముద్దుగా అన్నాడు రాజాలు సీతయ్య దగ్గరికొచ్చాడు.

అయ్యోయ్! బలేగుందిలే! యాడేడో పోతున్నట్టుంది. దీని సిగ...దర...గా సారా తాగితే ఇంత గమ్మత్తుగా ఉంటదని తెలిత్తే నీకంటే ముందే నేనే ఎప్పుడో తాగే వోణ్ణి. ఆహా ఎంత మజా...ఏదే ఒక రూపాయయ్యె ఎహే ఇయ్యమంటుంటె...

సీతయ్యను ఆలోచనలు ముసురుకున్నాయి. ఇంకేం చేయడం?

LPC



ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెశర్ లో సాదారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

: వివరములకు :

Grams: "NAIDUBROS" Phone: Office: 22409 Works; 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002